

కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సోమవారం గౌడకులస్తులకు కాటమయ్య రక్షణ కిట్‌లను కలెక్టర్ కుమార్‌దీపక్ అందజేశారు. కాటమయ్య రక్షణ కిట్‌ల ద్వారా 80శాతం వరకు ప్రమాదాలను నివారించవచ్చు అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీఅధికారి శివ్‌ఆశిష్‌సింగ్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణ, జిల్లా వెనకబడిన తరగతు అభివృద్ధి అధికారి పురుషోత్తం, అబ్కారీ మద్యనిషేధ సీఐ సమ్మయ్య, అధికారులు సురేష్, నరేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆహ్లాదం అధ్వానం..!



- కళావిహీనంగా మారిన అండర్ బ్రిడ్జి పార్కు
- పార్కు స్థలం కబ్జా చేసిన వ్యాపారి
- పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం

పార్కుల స్థలంలో ఏర్పాటు చేసుకున్న స్థిర నివాసాలు

మంచిర్యాల, జూలై7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రజల కోసం రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన మినీపార్కు రూపరేఖలు పూర్తిగా మారిపోయాయి. పార్కును సమూలంగా చిదిమేసిన ఓ చిరువ్యాపారి ఆ స్థలంలో కుటుంబంతో సహా తిష్ట వేసినప్పటికీ మున్సిపల్ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. దీంతో ఇంత కాలం ప్రజలకు ఆహ్లాదాన్ని పంచిన అండర్ బ్రిడ్జి ఏరియా పూర్తిగా కలావిహీనంగా దర్శనమిస్తోంది. మినీపార్కులో ప్రస్తుతం గత స్మృతికి చిహ్నంగా కొన్ని పక్షు ల బొమ్మలు, ఇతర పరికరాల మాత్రమే మిగిలాయి. మినీ పార్కు ముందు నుంచి నిత్యం వందలాది మంది పట్టణ ప్రజలు రాకపోకలు సాగిస్తూ అధికారుల వైఖరి పట్ల చీవాట్లు పెడుతున్నారు.

కానరాని ఓడీఎఫ్...

మంచిర్యాల మున్సిపాలిటిలో గతంలో వందశాతం బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలనకు అధికారులు శాయశక్తుల కృషి చేశారు. ఇందుకోసం వీదులవెంట టాయిలెట్లు, మూత్రశాలలు నిర్మించారు. దీంతో పట్టణాన్ని వందశాతం బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే దానికి భిన్నంగా ప్రస్తుతం అదేదారిలో పట్టణం పయనిస్తోంది. నగర పాలక సంస్థగా మారినప్పటికీ వందశాతం ఓడీఎఫ్(బహిరంగ మల మూత్రవిసర్జన) నిర్మూలన అమలు కావడం లేదు. ముఖ్యంగా చేతి వృత్తులవారు అండర్ బ్రిడ్జి ఏరియాను హస్తగతం చేసుకోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పార్కును చదును చేసి.. మిగతా 7లో

రూ. 20లక్షలతో అభివృద్ధి...

జిల్లా కేంద్రంలోని శ్రీనివాసటాకీస్ ఏరియా, కాలేజీ రోడ్డును కలుపుతూ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగింది. శ్రీనివాస్ టాకీస్ ఏరియా నుంచి కాలేజీ రోడ్డు వైపు వెళ్లేందుకు బ్రిడ్జి కింద అండర్ పాస్ ఏర్పాటు చేసి ఇరు వైపుల సర్వీసు రోడ్లు నిర్మించారు. అండర్‌పాస్ వద్ద రూ.20లక్షలు జనరల్ ఫండ్ వెచ్చించి ఇరు వైపుల అందమైన మొక్కలు, వాల్ పెయింటింగ్స్‌తో పాటు వివిధ రకాల జంతువులు, పక్షి బొమ్మలను ఏర్పాటుచేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. 2018-19 సమయంలో అప్పటి కలెక్టర్ బారతీ హోలీకేరి ఆదేశాల మేరకు మున్సిపల్ అప్పటి కమిషనర్ స్వరూపరాణిపార్కు అభివృద్ధిపనులు స్వయంగా పర్యవే క్షించారు. అండర్‌బ్రిడ్జి ఏరియా మినీ పార్కుగా అభివృద్ధి చెందడంతో చూపరులను అమితంగా ఆకట్టుకు నేది. గతంలో పార్కు ప్రదేశంలో కొంతమంది చేతివృత్తుల వారు స్థిర పడి తమ కార్యకలాపాలు కొనసాగించే వారు. ఆ సమ యంలో అండర్‌పాస్ వద్ద స్నానాలు, మలమూత్ర విసర్జనలు చేయడంతో స్థానికులు ఆందోళనబాటపట్టారు. ఎన్నిప్రయత్నాలు చేసిన చేతి వృత్తుల వారు ఆస్థలాన్ని ఖాళీ చేయకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు మధ్య కమిషనర్ స్వరూపరాణి వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించి మినీపార్కు ఏర్పాటుకు బాటలు వేశారు.



గత స్మృతికి చిహ్నాలుగా మిగిలిన పార్కు ఆనవాళ్లు

జీవో నంబరు 282ను రద్దు చేయాలి

- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



మంచిర్యాలలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్ష కార్మిక సంఘాల నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జీవో నెంబరు 282ను రద్దుచేయాలని వామ పక్ష, కార్మికసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ జీవోను రద్దు చేయాలని కోరుతూ సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీచౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, మేకల దాసులు మాట్లాడుతూ 44కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. దాని పర్యవసానంగా జీవో నెంబరు 282 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పని విధానం రద్దు చేసి 10 గంట ల పని విధానం అమలు చేయాలని విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రధాని మోదీ కార్మిక వర్గంపై తన మార్క్ రాజకీయాలను చూపిస్తున్నారని ఇది దుర్మార్గమన్నారు. వెంటనే ఈ జీవోను రద్దు చేయాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎం, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు సంకె రవి, దుంపల రంజిత్, న్యూడె మోక్రసీ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శులు లాల్‌కుమార్, శ్రీనివాస్, నాయకులు దేవరాజ్, కలీందర్ ఆలీఖాన్, పోలు, మల్లేష్, మల్లయ్య, సోని పోచన్న, రాజేష్, రాజేశం, రేణుక, ప్రకాశం, రాములు, ప్రభాకర్, అరుణ, తిరుపతి, మల్లేష్, సది,సాధిక్, రమేష్, దేవయ్య , గణేష్, రాజు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీష్‌రాజ్ అన్నారు. కార్యాలయంలో డాక్టర్ హరీష్‌రాజ్ ఆధ్వర్యంలో సోమవారం కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులకు అందిస్తున్న సేవలు, టిపాస్కాన్, ఇతర స్కాన్‌లకు రేడియోలజిస్టుల ద్వారా అందిస్తున్న సేవలపై చర్చించారు. ఆసుపత్రుల్లో గర్భవతుల వివరాల నమోదు, 102అంబులెన్స్ సర్వీసులను రోజువారీగా సమీక్ష చేయడం, స్కానింగ్‌కు వచ్చేవారికి సౌకర్యాలు కల్పించడంపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే గర్భిణులకు, రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. జిల్లాలోని 60ఏళ్ల దాటిన వారందరికి నిర్ధారణ పరీక్షలుచేయడంతో పాటు క్షయవ్యాధి నివారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సంచాలకులు డాక్టర్ కోటేశ్వర్‌రావు, డాక్టర్ భీష్మ, వైద్యులు కృపాబాయి, రవి, సుధాకర్, దేవేందర్‌నాయక్, జిల్లా ఉప వైద్యాధి కారి సుధాకర్ నాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మత్స్య సొసైటీ జల వనరులకు సరిపడేంత ఉచిత చేప, రొయ్య పిల్లలను అందించాలని, మత్స్య సొసైటీ ఖాతాల్లో నగదు జమ చేయాలని కోరుతూ ఈ నెల 21న చేపట్టిన ఛలో కలెక్టరేట్‌కు మత్స్యకారులు వేలాదిగా తరలి రావాలని తెలంగాణ మత్స్యకారుల మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చార్వాక హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నేటికి ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ విషయంలో నిర్దిష్టమైన ప్రకటన చేయక పోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు బోడంకి చందు, సంకె రవి, రాములు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

డీసీపీ భాస్కర్

శ్రీరాంపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆదేశించారు. సోమవారం ఆయన సీసీసీ-నస్పూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, నేరస్తుల అరెస్ట్, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్లు వేయడం పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రధానంగా మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి, నిందితులకు శిక్షలు పడేలా కోర్టులో సాక్ష్యాధారాలు సమర్పించాలన్నారు. దొంగతనాలు జరుగకుండా సిబ్బంది నిరంతరం అప్ర మత్తంగా ఉండాలని, రోడ్డుప్రమాదాల నివారణకు సంబంధిత శాఖ అధికారులతో కలిసి చర్యలు చేపట్టాలని సూచించారు.



పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటుతున్న డీసీపీ భాస్కర్

అనంతరం ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రూరల్‌సీఐ అశోక్, ఎస్‌ఐ ఉపేందర్ రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అటవీ భూ ములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అటవీ చట్టాలను ఉల్లంఘించినా, భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్ సింగ్, ఏసీపీలు ప్రకాష్, రవికుమార్, వెంకటేశ్వర్‌లు, తహసీల్దార్‌లు, అటవీ అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి కలెక్టర్ దరఖా స్తులు స్వీకరించారు. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామన్నారు. లక్షెట్టిపేట మండలం మోదాల గ్రామానికి చెందిన దమ్మ సూర్య తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని అర్జీ అందించాడు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ భూములు, సింగరేణి క్వార్టర్లుకబ్జాకు గురవు తున్నాయని కబ్జాకాకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి శ్రీనివాస్ వినతిపత్రం అందించాడు. అలాగే నెన్నెల, చెన్నూరు, బెల్లంపల్లి, లక్షె ట్టిపేట, ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెకర్ మాట్లాడుతూ ప్రజావా ణిలో 35దరఖాస్తులు వచ్చాయని, పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణ, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయుల నియామకానికి ఇంటర్వ్యూలు

హాజీపూర్, జూలై7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపులే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిన బోదించేందుకు అతిథి ఉపాధ్యాయుల నియామకాలు చేపడుతున్నట్లు ఎంజేపీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శేరు శ్రీధర్ ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఈ నెల 10న డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎంజేపీ పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్లమాధ్యమంలో బోధించేందుకు తెలుగు టీజీటీ జనరల్ 1, మహిళ1, జెఎల్ జనరల్ 1. హిందీ పీజీటీ మహిళ 1, ఇం గ్లీషు పీజీటీ మహిల1, జనరల్1. మ్యాథ్స్ జేఎల్ జనరల్01, టీజీటీ మహిళ1, పీజీటీ మహిళ2, జనరల్ సైన్స్ టీజీటీ జనరల్1, సోషల్ పీజీటీ జనరల్1. జువాలజీ జెఎల్ మహిళ1, జనరల్1. ఎకనామిక్స్ మహిళ1, కామర్స్ జనరల్1, సబ్జెక్టులు బోధించుటకు అర్హులైన అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. ఈనెల10న లక్షెట్టిపేటలోని బాలుర ఎంజేపీ బాలుర పాఠశాలలో ఉదయం 9గంటలకు బయోడేటా విద్యార్హతల జిరాక్స్ పత్రాలు జతపరిచి ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరుకావాలని తెలిపారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలి

హాజీపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేని స్కూల్‌బస్సులను సీజ్ చేయాలని యుఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మిట్ట పల్లి తిరుపతి జిల్లా రవాణశాఖ అధికారి వేంపల్లిలో ఆర్టీఏ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తిరుపతి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రైవేటు స్కూల్స్, కళాశాలలు ఫిట్‌నెస్‌లేని బస్సులను నడుపుతున్నాయని అన్నారు. టాటాఏసీ వాహనాల్లో ఎక్కువ మంది విద్యార్థులను తరలి స్తున్నారని బస్సు ఫీజుల పేరుతో వేలాది రూపాయలను ప్రైవేటుకార్పొరేట్ యాజ మాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను నుంచి వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. లాభార్జనే ధ్యేయంగా విద్యార్థుల భవిష్యత్‌ను భద్రతలేకుండా గాలికి లేకుండా వదిలేశారన్నారు. పూర్తి ఫిట్‌నెస్ ఉండి అన్ని సదుపాయాలు ఉన్న బస్సులకు అనుభవం ఉన్న డ్రైవర్లను మాత్రమే వినియోగించాలన్నారు.

'డీసీఈబీ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలి'

మంచిర్యాలక్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): డీసీఈబీ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో యాదయ్య అన్నారు. జిల్లా ఉమ్మడిపరీక్షల నిర్వహణ బోర్డు మొదటి కార్యవర్గం సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరంలో డీసీఈబీకి సంబంధించిన కార్యక్రమాలపై చర్చించారు. అందరి అభిప్రాయాలు సేకరించారు. పరీక్ష పత్రాలు రూపొందించడం, నాణ్యమైన ప్రశ్నాపత్రాలు ముద్రితం అయ్యే విధంగా చూడడం, సమ్మెటివ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడం, డీసీఈబీ కార్యక్రమాల నిర్వహణ మరింత సమర్థవంతంగా జరుగడానికి సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో డీసీఈబీ సెక్రటరీ మహేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ వేణు మాధవ్, కార్యవర్గ సభ్యులతో పాటు జిల్లా సైన్స్ అధికారి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

జన్నారం, జూలై7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని గడపగడపకూ తీసుకెళ్లి విస్తృత ప్రచారం కల్పించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆర్ ఆర్‌ఎస్ ఫంక్షన్‌హాల్‌లో జన్నారం, నిర్మల్ దస్రాబాద్ మండల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్లపాటు అధికారంలో ఉండి చేసిన గోరంత అభివృద్ధిని కొండంత చెప్పుకుంటున్నారని అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఈ ప్రచారాలను నమ్మకుండా నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి చెప్పాలని తెలిపారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలకు చేసిన ద్రోహాన్ని వివరించాలని రాష్ట్రంలో రెండులక్షల రుణమాఫీని గత ప్రభుత్వం ఎప్పుడైనా చేసిందా అన్నారు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం యూరియా సరైన రీతిలో సప్లై చేయకుండా కొరతను సృష్టిస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ప్రతిపథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, సయ్యద్ ఫసియుల్లా, సింగిల్‌విండో చైర్మన్ అల్లం రఘు, ఖానాపూర్ సింగిల్ విండో చైర్మన్ శైలజా రమేశ్‌రావు, నాయకులు ముజాఫర్ అలీ, మాణిక్యం, మల్లేశ్, సుభాష్ రెడ్డి, మచ్చ శంకరయ్య, ఇంధయ్య పాల్గొన్నారు.

మంత్రిని కలిసి.. పుష్పగుచ్ఛం అందించి..



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాధిక

మందమర్రిటౌన్, జూలై7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక ఉపాధికల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకట స్వామిని మందమర్రికి చెందిన స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జి రామిల్ల రాధిక మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా మంత్రి సూచనలు, సలహాలు తీసుకున్నట్లు తెలిపారు.

కేజ్ వీల్స్‌తో రోడ్డుపైకి వస్తే చర్యలు తప్పవు

జన్నారం, జూలై7 (ఆంధ్రజ్యోతి): రహదారులపై కేజీవీల్స్‌తో రోడ్లపైకి రావడం రోడ్లు పూర్తి స్థాయిలో దెబ్బతింటాయని చర్య లు తప్పవని ఎస్‌ఐ అనూష అన్నారు. కేజీ వీల్స్ ఉపయోగించే ట్రాక్టర్‌లు వాటికి తొడుగులు తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యాజమానులు తప్పనిసరిగా దృష్టి సారించాలని లేకుంటే కేసులు తప్ప వన్నారు. రహదారి భద్రత మనందరి బాధ్యత అని అన్నారు. లక్షల రూపాయలు పెట్టి వేస్తున్న రహదారులపై కేజ్‌వీల్స్ నడిపి రహదారులను దెబ్బతీయొద్దన్నారు.

మంచిర్యాల రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి

- ఆధునీకరణ పనులను పరిశీలించిన దక్షిణమధ్య రైల్వే జీఎం సందీప్ మాథుర్

7



బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న జీఎం సందీప్ మాథుర్

జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టుపై చిగురిస్తున్న ఆశలు

- కేంద్ర జలశక్తి శాఖ బృందం పర్యటన పూర్తి
- ప్రభుత్వానికి అందజేయనున్న నివేదికలు
- నిధులు వచ్చే అవకాశం

6



జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు (ఫైల్)

దేవాపూర్-తిర్యాణి

అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం

- భయాందోళనలో అటవీ శివారు ప్రాంత ప్రజలు

కాసిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్, తిర్యాణి అటవీ సరిహద్దు ప్రాంతంలో నాలుగు రోజులుగా పెద్దపులి సంచరిస్తుండడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నాలుగు రోజుల క్రితం కాసిపేట మండలంలోని సోనాపూర్, అరిడెపల్లి అటవీ ప్రాంతం గుండా కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి అటవీ రేంజ్ పరిధిలోని ఏదులపాడ్, రొంపెల్లి, ఫారెస్టు బీటీలో పెద్దపులి తిరుగుతున్నట్లుగా సమాచా రం. రెండున్నరేళ్ల ఆడపులి గత ఏడాది అక్టోబరులో మహారాష్ట్ర నుంచి తెలంగాణలోని కెరమెరి మండలం దేవుడిపల్లి బీటిలోకి ప్రవేశించింది. ఈ పులి కెరమెరి, ఆసిఫాబాద్, కోడంమవాడ్, గోలేటి, తిర్యాణి అటవీ రేంజ్ పరిధిలో సంచరిస్తూ ఇటీవల దేవాపూర్ అటవీ సెక్షన్‌లోకి వచ్చింది. తిర్యాణి అటవీరేంజ్ పరిధిలో సంచరిస్తోంది. తిర్యాణి రేంజ్ పరిధిలోని గోయగాం, మొర్రిగూడలో ఆవులమందపై దాడి చేసిన ఘటనతో పెద్దపులి తిరుగుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. నాలుగు రోజుల క్రితం సెక్షన్ పరిధిలోని దేవాపూర్ అటవీసెక్షన్ లోకి వచ్చి మళ్లీ సోనాపూర్ ఎగ్గండివాగు గుండా తిర్యాణిలోకి వెళ్లినట్లు సమాచారం. దీంతో అటవీశివారు ప్రాంతంలో సాగు చేసుకుంటున్న రైతులు వ్యవసాయకూలీలు, పశువుల కాపరులు, భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై లక్షెట్టిపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ అనితను వివరణ కోరగా పెద్దపులి దేవాపూర్ అటవీసెక్షన్ లోకి వచ్చి వెళ్లినమాట వాస్తవమేనన్నారు. పెద్దపల్లి సంచరిస్తుండడంతో అటవీశివారు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా అడవిలోకి వెల్లవద్దని సూచించారు. పశువుల కాపరులు, రైతులు వ్యవసాయ కూలీలు అడవిలోకి వెళ్లవద్దని, వన్యప్రాణులకు హానీ తలపెడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


గణేష్ (ఫైల్)

వాంకిడి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన నానవేణి గణేష్(30) అనే యువకుడు వాంకిడి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మృతుడు గణేష్ మండల కేంద్రంలో బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్న క్రమంలో జాతీయ రహదారిపై టోల్ ప్లాజా సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలతో పడిఉన్న గణేష్‌ను గమనించిన కొందరు వ్యక్తులు పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు గణేష్ భార్య రవళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

దండేపల్లి జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన మానుపాటి రాజయ్య(74)అనే వృద్ధుడు కడుపు నొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులో ఓ మామిడితోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు దండేపల్లి ఎస్సై తాహసీనోద్దీన్ తెలిపారు. ఎస్సై, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజయ్య కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాలేదు. దీంతో కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం సమయంలో ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా అతని ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం నర్సాపూర్ గ్రామశివారులో ఓ మామిడితోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడు రాజయ్య కొడుకు మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తాహసీనోద్దీన్ వెల్లడించారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

ఆసిఫాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మున్సిపాలిటి పరిధిలోని అక్రమ కట్టడాలపై విజిలెన్స్ అదికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని అటవిశాఖ చెక్‌పోస్టు సమీపంలో నిర్మించిన అక్రమ కట్టడాలు, రోడ్లు, డ్రైనేజీలను కరీంనగర్ విజిలెన్స్ విభాగం తహసీల్దార్ దినేష్, సీఐ రవిందర్ పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ కట్టడాలపై విచారణ చేపట్టి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ రియాజ్‌ఆలీ, మున్సిపల్ కమిషనర్ గజానంద్ పాల్గొన్నారు.


జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు (ఫైల్)

కాగజ్‌నగర్ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం జగన్నాథ్‌పూర్ వద్ద నిర్మిస్తున్న జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టుల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు గత నెల 10న కేంద్ర పెట్రోలియం, సహజ వనరుల గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్ శేషన్ ఆధ్వర్యంలో కేంద్ర జలశక్తి శాఖ బృంద సభ్యులు పర్యటించారు. ఇందులో భాగంగా జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టును కూడా సందర్శించారు. అసంపూర్తి దశ వీడని పరిస్థితులపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. ఈ నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి త్వరలోనే అందజేయనున్నారు. అనంతరం నిధులు విడుదలయ్యే అవకాశాలుండటంతో ప్రాజెక్టు భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి.

జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టుపై చిగురిస్తున్న ఆశలు

- కేంద్ర జలశక్తి శాఖ బృందం పర్యటన పూర్తి
- ప్రభుత్వానికి అందజేయనున్న నివేదికలు
- నిధులు వచ్చే అవకాశం

అసంపూర్తి నిర్మాణంతో ఇబ్బందులు..

2005లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జగన్నాథ్‌పూర్ వద్ద పెద్ద వాగు సమీపంలో జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.125 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేశారు. పనులను గ్యామన్ ఇండియా కాంట్రాక్టర్ దక్కించుకొని పనులు ప్రారంభించారు. సకాలంలో నిధుల విడుదల కాకపోవటంతో సంబంధిత కాంట్రాక్టర్ పనుల నిలిపివేయటంతో అతీగతీలేని పరిస్థితి ఏర్పడింది. మళ్లీ ప్రభుత్వం స్పందించి కాల గడువు పరిమితి పెంచటంతో పనులు ప్రారంభించారు. ఫలితంగా కేవలం నాలుగేళ్లపాటు పిల్లర్ల దశ వీడని పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రక్రియ కాగానే మళ్లీ ప్రత్యామ్నాయంగా సబ్‌కాంట్రాక్టర్‌తో పనులు చేయించటంతో ప్రాజెక్టు నిర్మాణం ఇంకా పూర్తిస్థాయిలో కాలేదు.


ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేంద్ర జలశక్తి శాఖ బృందం

రాష్ట్రాలు విడిపోవటంతో ఈ ప్రాజెక్టు సమస్యను అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి అప్పటి ఎమ్మెల్యే కోనప్ప తీసుకెళ్లారు. వ్యయభారం పెరగటంతో ఈ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతో సమస్యను పరిష్కరించేందుకు ప్రాజెక్టు వ్యయాన్ని ఏకంగా రూ.246.49 కోట్లకు పెంచేసి పనులు చేపట్టేందుకు మళ్లీ ప్రక్రియ ప్రారంభం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం ప్రస్తుతం పిల్లర్ల స్థాయి వీడి గేట్ల వరకు వచ్చింది. 20 ఏళ్లు గడిచినా ఇంత వరకు ప్రాజెక్టు నిర్మాణం, కాలువలు పూర్తి కాలేదు.

పర్యటనలో తేలిన అంశాలివే..

రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర జలశక్తి శాఖ బృంద సభ్యులు సర్వేలను నిర్వహించారు. ఈ ప్రక్రియలో భాగంగా కాగజ్‌నగర్ మండలం జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టును గత నెల 10న కేంద్ర పెట్రోలియం, సహజ వనరుల గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్ శేషన్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. ఏ గేట్, విద్యుత్ లైన్లు ఇంకా ఏర్పాటు చేయలేదని, భూ సేకరణ, కాల్వల నిర్మాణం డైవెర్షన్ వంటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు, 600 మీటర్ల బండ్ డైవెర్షన్ ఇంకా చేయాల్సి ఉన్నట్లు, అలాగే మౌలిక నిర్మాణాల లోపాలున్నట్లు, మారిన ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయింపులు సరిగ్గా లేకపోవటంతోనే పెండింగ్‌లో పడినట్లు సర్వే విచారణలో తేలింది.

బృంద సభ్యులు కేంద్ర ప్రభుత్వానికి ప్రాజెక్టు పూర్తిచేసేందుకు ఎంత మేర నిధులు అవసరముంటాయి..? అనే లెక్కలు పంపించిన తర్వాత నిధులు విడుదలయ్యే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. దీంతో ఈ ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. కాగా ఈ వివరాలు సేకరించిన కేంద్ర జలశక్తి బృంద సభ్యులను సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు హైదరాబాద్‌లో గత నెల 11న కలిసి సమస్యను వివరించారు. జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు పెండింగ్‌లో ఉన్నపరిస్థితులు,? ప్రాజెక్టు పూర్తి కాకపోవటంతో ఏర్పడిన సమస్యలను వివరించారు. అలాగే రైతులు పడుతున్న ఇబ్బందులను బృంద సభ్యులకు కూలంకషంగా వివరించారు.

షీ టీంపై అవగాహన

ఆసిఫాబాద్ రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆసిఫాబాద్ షీ టీం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం సిబ్బంది మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేదింపులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికులు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైం, మాదకద్రవ్యాల వంటి నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ బస్టాండ్ వద్ద పాఠశాల విద్యార్థినులను ఏడిపిస్తూ వేదింపులకు గురిచేస్తున్న ఇద్దరు ఆకతాయిలను ఆసిఫాబాద్ షీ టీం సభ్యులు స్వప్న, రజిత, దినేష్ సోమవారం పట్టుకున్నారు. వారికి తగిన కౌన్సెలింగ్ నిర్వహించారు. విద్యార్థులు మహిళలు వేదింపులకు గురైతే 8712670564 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

సమాన పనికి సమాన వేతనం అందించాలి

సిర్పూర్(టి), జూలై 7(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో పార్ట్‌టైం, గెస్ట్ రూపాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని గురుకులం, కేజీబీవీ తదితర హస్టళ్లలో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులకు వచ్చే పీఆర్సీ, డీఏ, పెండింగ్ వేతనాలు, ఏరియర్స్ తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుభాష్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ వెంకటేష్ దోత్రే


అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగజ్‌నగర్ మండలం అందవెల్లి గ్రామానికి చెందిన వాణిదేవి, చింతలమానేపల్లి మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన కవిత తమకు ఇందిరమ్మ ఇళ్లు అందజేయాలని దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన శాంత తన భర్త మరణించినందున తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామస్తులు పోచమ్మ ఆలయానికి వెళ్లే దారిని కొందరు రైతులు ఆక్రమించినందున తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతలమానేపల్లి మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన శ్రీధర్ తాను కొనిన గ్రామ పంచాయతీలో శ్మశాన వాటిక పనులు చేపట్టి పూర్తి చేశానని, బిల్లులు ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం వర్తనంబాల గ్రామానికి చెందిన తానుబాయి తనకు వంశపారంపర్యంగా వచ్చిన భూమిని కొందరు ఆక్రమంగా పట్టా చేసుకున్నారని తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ పట్టణం నూర్‌నగర్‌కు ఎండిన పర్వానబేగం నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. తిర్యాణి మండలం కేతనపల్లి గ్రామానికి చెందిన రాజలింగు తన తండ్రి పేరిట గల భూమిని తనకు తెలియకుండా కొందరు పట్టా చేసుకున్నారని, అట్టి పట్టాను రద్దు చేసి తన పేరిట భూమిని మార్చాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులపై నిర్లక్ష్యం చేయవద్దని, అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

దహెగాం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ మునవర్ షరీఫ్, వ్యవసాయాధికారి రామకృష్ణ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులను అధిక ధరలకు అమ్మితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఎరువులు వాడకాన్ని తగ్గించి నానో యూరియా, నానో డీఏపీ వైపు మొగ్గు చూపాలని సూచించారు.

ఎస్పీఎంలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి


ర్యాలీ నిర్వహిస్తున్న నిరుద్యోగులు

కాగజ్‌నగర్ టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): సిర్పూర్ పేపర్ మిల్లులో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం మిల్లు అధికారులకు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ పొన్న రమేష్ జేఏసీ నాయకులు మజాముల్లుద్దీన్, శ్రీనివాస్, అఖిల్, నిరుద్యోగులు పాల్గొన్నారు.

విషపు మొక్కలు తిని వంద గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

పెంచికల్‌పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోడ్‌పల్లిలో విషపు మొక్కలు తిని వంద గొర్రెలు సోమవారం మృత్యువాత పడగా మరో వంద గొర్రెలు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. బాధితుల వివరాల ప్రకారం.. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం శిర్సా గ్రామానికి చెందిన జాడే బీరయ్య, జాడే శంకర్, జాడి బీరయ్య అనే ముగ్గురు గొర్రెల పోషకులు కొంతకాలంగా పలు గ్రామాల్లో సంచరిస్తూ గొర్రెలను మేపుతున్నారు. ఈ క్రమంలో పెంచికల్‌పేట మండలం లోడ్‌పల్లి గ్రామానికి చేరుకుని రెండు రోజులుగా గొర్రెలను మేపుతున్నారు. మేత మేస్తున్న క్రమంలో విషపు ఆహారం తినడంతో సోమవారం సుమారు 100కు పైగా గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మరో వందకు పైగా గొర్రెల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. మండల పశువైద్యాధికారి రోహిత్‌కు సమాచారం అందివ్వడంతో మఠన స్థలానికి చేరుకొని చనిపోయిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. విషపు ఆహార మొక్కలు తినడం వల్ల గొర్రెల కాలేయం దెబ్బతిని చనిపోయినట్లు ఆయన ధ్రువీకరించారు. మిగతా గొర్రెలకు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. లక్షల్లో నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.



సీఎంపీఎఫ్ అందించడంలో జాప్యాన్ని నివారిస్తాం

శ్రీరాంపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు సీఎంపీఎఫ్ అందించడంలో జాప్యాన్ని నివారిస్తామని రామగుండం రీజనల్ కమిషనర్-1 హరి పవార్, రామగుండం రీజనల్ కమిషనర్-2 కె గోవర్ధన్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన 'ప్రయాస్' కార్యక్రమంలో భాగంగా వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బీసీ పెండెన్సీ లక్ష్యంగా తాము సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సీఎంపీఎఫ్ నంబర్ కేటాయింపు నుంచి ఉద్యోగ విరమణ పొందే వరకు అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. సీఎంపీఎఫ్ పెన్షన్‌కు సంబంధించి లావాదేవీలు సీ కేర్స్ పోర్టల్ ద్వారా జరుగుతున్నాయని తెలిపారు. మధ్య దళారుల ప్రమేయం లేకుండా సీఎంపీఎఫ్‌ను సులభంగా పొందవచ్చన్నారు. అనంతరం సీ కేర్స్ పోర్టల్ ఉపయోగం, సమస్యల నమోదు, తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, సీనియర్ పీవో కాంతారావు, సీఎంపీఎఫ్ కార్యాలయ సిబ్బంది, అన్ని గనులు, విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలి


కాసిపేటగనిపై మాట్లాడుతున్న మందమర్రి జీఎం దేవేందర్

కాసిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో కార్మికులు అప్రమత్తంగా ఉండి రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని మందమర్రి జీఎం దేవేందర్ సూచించారు. సోమవారం ఆయన కాసిపేట 1వ గనిని సందర్శించి పని స్థలాలను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ సమష్టిగా పనిచేసి ఉత్పత్తి లక్ష్యాలను అందుకోవాలన్నారు. అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేసినప్పుడే గని మనుగడ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కేకే గ్రూప్ ఏజెంటు రాంబాబు, కాసిపేట గని మేనేజర్ సతీష్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను యాజమాన్యం వ్యతిరేకించడం సరికాదు

- సమ్మెకు అధికారులు మద్దతు పలకాలి - కార్మిక జేఏసీ నాయకులు



మందమర్రి వర్క్‌షాపులో మాట్లాడుతున్న కార్మిక జేఏసీ నాయకులు, శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న వీరభద్రయ్య

మందమర్రిటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త ఒక్కరోజు సమ్మెను యాజమాన్యం వ్యతిరేకించడం సరికాదని కార్మిక జేఏసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ, మేడిపల్లి సంపత్, అల్లి రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం ఏరియాలోని వర్క్‌షాప్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్ లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పటినుంచే సమ్మె నివారణకు సంబం ధించి అధికారులు అత్యుత్సాహం చూపడం మంచిదికాదన్నారు. కంపెనీ కార్మికులు ఉంటేనే అధికారులు ఉంటారనే విషయాన్ని వారు గ్రహిస్తే మంచిదని తెలిపారు. కేంద్రప్రభుత్వం నల్లచట్టాలను తెరపైకి తీసుకొచ్చి ప్రతీ ఉద్యోగి చేత 12 గంటల పని చేయించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. సమ్మె కేంద్రానికి గుణపాఠం కావాలని కార్మికులు, వారి కుటుంబసభ్యులు నిరసన తెలపాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక జేఏసీ నాయకులు భీమనాథుని సుదర్శన్, ఎగ్గెటి రాజేశ్వర్‌రావు, బానయ్య, పంజాల ఈశ్వర్, తోట రాజిరెడ్డి, తోట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మెతో కేంద్రానికి గుణపాఠం చెప్పాలి

శ్రీరాంపూర్(ఆంధ్రజ్యోతి): కొత్తగా తీసుకువచ్చే నాలుగు లేబర్ కోడ్లను నిరసిస్తూ ఈ నెల 9న జేఏసీ నిర్వహించే సమ్మెను విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఆర్కే 7, ఆర్కే న్యూటెక్ గనులపై గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి కంచెర్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, జీఎం చర్చల ప్రతినిధులు సంపత్, బద్రి బుచ్చయ్య, ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, ప్రధానకార్యదర్శి ఏనుగు రవీందర్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, చంద్రశేఖర్, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఎస్ఆర్‌పీ 3 గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం సమ్మ రాజయ్య, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి బ్రహ్మానందం, టీఎస్‌యూఎస్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్‌లోని వర్క్‌షాప్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో హెచ్ఎంఎస్ కేంద్ర నాయకులు తిప్పారపు సారయ్య, హెచ్ఎంఎస్ బ్రాంచ్ కార్యదర్శి పొగాకుల అశోక్, పిట్ కార్యదర్శి వినయ్, నాయకులు పాల్గొన్నారు. ఈ నెల 9న తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో సమావేశం నిర్వహించారు. బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కాశరాజు ప్రభాకర్, కార్యదర్శి బూర వీరేశం, సహాయ కార్యదర్శి చారి, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

బెల్లంపల్లి: ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలని సింగరేణి జేఏసీ నాయకులు అన్నారు. సోమవారం శాంతిఖని గనిపై గేటు మీటింగ్‌లో కార్మికులతో మాట్లాడారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దాగం మల్లేశ్, చిప్ప నర్సయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలి

శ్రీరాంపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ సూచించారు. జీఎం కార్యాలయంలో సోమవారం ఆయన అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొన్ని కార్మిక సంఘాలు వివిధ డిమాండ్లతో సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఆయా డిమాండ్లు అత్యధికంగా సింగరేణికి కార్మికులకు సంబంధించినవి లేవని, యాజమాన్యం తీర్చగలిగినవి కూడా కావని తెలిపారు. ఒక్క రోజు సమ్మె చేస్తే 1.92 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోతుందని, సింగరేణికి 76 కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుందని తెలిపారు. అలాగే కార్మికులు 13.07 కోట్ల రూపాయల వేతనాలు కోల్పోతారని గుర్తుచేశారు. సింగరేణి కార్మికులు సమ్మెలో భాగస్వామ్యం కావద్దని జీఎం సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఐఇడి, శ్రీరాంపూర్ ఓసీపీ పీవోలు ఏవీ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

శ్రీరాంపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా ఆరోగ్యాధికారి డాక్టర్ లోకేశ్ రెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీపై సోమవారం నిర్వహించిన ఆరోగ్య సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వానాకాలంలో కలరా, టైఫాయిడ్, హెపటైటిస్, డయేరియా, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఉందన్నారు. ఇళ్ల సమీప ప్రాంతాల్లో నీటి నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. అనారోగ్యం కలిగినప్పుడు వైద్యులిని సంప్రదించి, తగు చికిత్స తీసుకోవాలన్నారు. ఓసీపీ పీవో వెంకటేశ్వర్లు, మేనేజర్ శ్రీనివాస్, రక్షణాధికారి శ్రీధర్, సంక్షేమాధికారి ఓంకార్ బాపు, ఏఐటీయూసీ సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలి

బెల్లంపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఐబీపీఎల్ ప్రభుత్వ పనిగంటలు పెంచుతూ జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం ఆర్జీ ఏరియాలోని ఏరియాలోని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలతో మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తున్నారు. పనిగంటలను పెంచుతూ స్పష్టతలేని ఉత్తర్వులు జారీ చేయడం సరైందికాదన్నారు. వెంటనే ప్రభుత్వం ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికవర్గం చేపట్టే ఆందోళన పోరాటాలకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సిఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ ంటీ చాంద్‌పాషా, మణిరాంసింగ్, నీరటి రాజన్న, శంకర్, సుభాష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మందమర్రిరూరల్: రామకృష్ణపూర్‌లో ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే జూనియర్ గర్ల్స్ స్టేట్ లెవెల్ ఫుట్‌బాల్ పోటీలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అసోసియేయేట్ జనరల్ సెక్రటరీ పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, క్యాతనపల్లి మున్సిపల్ కమీషనర్ రాజులు పేర్కొన్నారు. సోమవారం ఠాగూర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పల్లె రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జైపూర్ : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలు, చెడు అలవాట్లపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ బండి ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: మంచిర్యాల వాగ్దేవి డిగ్రీకళాశాల విద్యార్థిని బీఎస్సీ ఎంపీసీఎస్ విభాగంలో సబియా సుల్తానాకు నాలుగు గోల్డ్‌మెడల్స్ సాధించింది. కాకతీయ యూనివర్సిటీ నిర్వహించిన 23 స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్స్‌ను అందుకుంది. కళాశాల కరస్పాండెంట్ మల్లయ్య, డైరెక్టర్లు ప్రిన్సిపాల్ అధ్యాపకులు ఆమెను అభినందించారు.

దండేపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబెద్కర్ యువజన సంఘం జిల్లా కోకన్వీనర్ కొల్లూరి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేకు సంఘం నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు.

తాండూర్ : మండంలోని అచ్చలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెంలోని పోచమ్మ తల్లి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. సోమవారం గుర్తించిన గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కాసిపేట: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పేరుకపోయిన చెత్తను గడ్డిని తొలగించి సోమవారం శ్రమదానం నిర్వహించారు. శ్రమదానం చేసిన వారిలో సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ, తిరుపతి, రాజేశ్వరి, గణపతి, పాల్గొన్నా రు.

మందమర్రిటౌన్ : మందమర్రి పట్టణంలో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీరీలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

మందమర్రిరూరల్ : మందమర్రి మండలంలో సోమవారం మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. రామకృష్ణపూర్‌లోని రామాలయం వద్ద పీరీలను దర్శించుకుని కుడుకలు, దస్తీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

దండేపల్లి : మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లోని మొహర్రం వేడుకలు నిర్వహించారు. పీరీలను డప్పు చప్పుళ్లతో ఊరేగించారు.

మందమర్రి టౌన్ : మందమర్రికి చెందిన తటకం శ్రీనివాస్(45) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నిషేధ సమయంలో ఆర్థిక భరోసా కరువు...

జూలై నుంచి ఆగస్టు వరకకు చేపల నిషేధమని అధికారులు ప్రశ్నిస్తున్నారు. అది కూడ ఈ సమయంలో చేపలు పునరుత్పత్తి దశలో ఉంటాయి. కాబట్టి మత్స్య కారులు కూడ సహకరిస్తున్నారు. కానీ రెండు నెలలు వారి కుటుంబ పోషణ కోసం తిప్పలు పడుతున్నారు. పొరుగు రాష్ట్రంలో చేపల వేట నిషేధ సమయంలో ఒక్కో మత్స్యకారుడికి రూ.15వేల నుంచి 20వేలు అందిస్తున్నారు. ఇక్కడ కూడ నెలకు రూ. 10వేల చొప్పున రెండు నెలలకు రూ. 20వేల ఆర్థిక భరోసా ప్రభుత్వం కల్పించాలని మత్స్యకారులు కోరుతున్నారు.



చేపల వేటకు తాత్కాలిక బ్రేక్

- మత్స్యకారులకు అందని భరోసా
- జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధం
- నోటీసులు జారీ చేసిన మత్స్యశాఖ
- మండలంలో వెయ్యి మందికి ఉపాధి కరువు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న మత్స్యకారులు

హాజీపూర్, జూలై7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం చేపలు పునరుత్పత్తి దశలో ఉంటాయి. ఇప్పుడు గుడ్లు పెట్టే సమయం కాబట్టి జూలై 1 నుంచి ఆగస్టు నెలా కరు వరకు రిజర్వాయర్లలో చేపల వేట నిషేధమని జిల్లా మత్స్య శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ రెండు నెలలు చేపల వేట నిషేధంతో మత్స్యకారులకు ఉపాధి కరువైంది. కుటుంబాలు గడవక ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితులు నెల కొన్నాయి. వేట నిషేధ సమయంలో ప్రభుత్వమే భరోసా కల్పించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేసిన అధికారులు...

జులై నుంచి ఆగస్టు వరకు చేపల వేట నిషేధమని మత్స్యకారులు రిజర్వాయర్లలలో అంటే మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు, రాళ్లవాగు ప్రాజెక్టులలో చేపల వేట నిషేధించబడిందని మత్స్యశాఖ అధికారులు ప్రకటించారు. అయితే మండలంలోని మత్స్యకారులకు ఈ రెండు ప్రాజెక్టులే జీవనాధారం. రోజు చేపల వేట సాగిస్తేనే కుటుంబాలు నడిచే పరిస్థితి. అసలే అంతంత మాత్రం జీవితాలు రోజు వచ్చే వందో రెండు వందలతో పూటగడుపుకునే పరిస్థితిలో జాలర్లు ఉన్నారు. ఇప్పుడు అది కూడ లేకపోవడంతో పస్తులు ఉండే పరిస్థితులు నెలకొన్నాయి. అలాగని కొందరు ఉపాధి కోసం చేపలవేటకు పోతే వారిని దొరకబట్టి అధికారుల వేధింపులు కూడ తప్పవు. ఇలా అధికారుల వేధింపులకు తాళలేక కొందరు ఇంటి పట్టునే ఉంటూ అర్థాకాలితో కాలం వెల్లదీస్తున్నారు.

మండలంలో 1066 మంది మత్స్యకారులు...

మండలంలో 16 మత్స్యశాఖల సంఘాలు ఉన్నాయి. ఇందులో 1066 మంది లైసెన్స్ కలిగిన మత్స్యకారులు ఉన్నారు. వీరు కాక మరో వంద మందికిపైగా ఎల్లంపల్లి రాళ్లవాగు ప్రాజెక్టులలో చేపలవేట జీవనాధారంగా బతుకుతున్నారు. వీరు నిత్యం ఎల్లంపల్లి ప్రాజెక్టు, రాళ్లవాగు ప్రాజెక్టు, ముల్కల్ల దిగువ గోదావరిలో చేపల వేట సాగిస్తూ జీవిస్తున్నారు. ప్రస్తుతం వలల రేటు పెరిగింది. వారానికి రెండు సార్లు వలలు మార్చాల్సి ఉంటుంది. వీరి పెట్టుబడిపోను వారికి మిగిలేది 300 లోపే. ఒక్కో రోజు చేపలు పడకపోతే అదికూడ మిగిలే ద ం లేదు. పట్టిన చేపలను దళా రులకు అమ్మితే తుట్టికి పావుషేరే.

ఉపాధి కరువైంది...

బొగ్గుల శేఖర్, మత్స్యకారుడు

నంనూర్



నేను ఎల్లంపల్లి ప్రాజెక్టులో చేపల వేటు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాను. జూలై నుంచి ఆగస్టు వరకు చేపల వేట నిషేధం ఉండడంతో జీవనం గడవడం కష్టంగా మారింది. ఈ సమయంలో ప్రభుత్వ జీవనోపాధి కింద నెలకు రూ.10వేల చొప్పున అందించాలని కోరుతున్నాం.

రెండు నెలలు చేపల వేట నిషేధం...

వికాస్, మత్స్యశాఖ ఏడీ మంచిర్యాల

రిజర్వాయర్లలో ఈ రెండు నెలలు 1 నుంచి ఆగస్టు చివరి వరకు చేపల వేట నిషేధమని ప్రకటించాము. మత్స్యకారులు ఎవరు చేపల వేటకు వెళ్లవద్దు. చేపల వేట చేస్తే చర్యలు తీసుకుంటాం.

జాతర ఏర్పాట్ల పరిశీలన

మందమర్రిరూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొక్కలగుట్టలో ఆదివారం జరిగే గాంధారి మైసమ్మ జాతర ఏర్పాట్లను సోమవారం సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌లు పరిశీలించారు. వారు మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు ఆత్మీయ వీడ్కోలు

నెన్నెల, జులై 7 (ఆంధ్రజ్యోతి) : బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో దేవేందర్‌రెడ్డికి అధికారులు, నాయకులు ఘణంగా వీడ్కోలు పలికారు. మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నరేష్, ఏపీ ఎం విజయలక్ష్మి, సూరింటెండెంట్ వీణ, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ శ్రీనాథ్, కాంగ్రెస్ నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్‌పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలపై అవగాహన

మందమర్రిరూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సారంగపల్లి గ్రామంలో వరిలో కాలిబాటలపై ఏవో కిరణ్మయి రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వరిలో నాటు వేసేటప్పుడు తూర్పు పడమరలుగా ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల ఎడంతో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం వల్ల వరి పైరుకు గాలి, వెలుతురు బాగా సోకుతుందని, తద్వారా వరి బాగా పెరుగుతుందన్నారు.

మంచిర్యాల రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి

దక్షిణమధ్య రైల్వే జీఎం సందీప్ మాథుర్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని దక్షిణమధ్య రైల్వే జీఎం సందీప్ మాథుర్ పేర్కొన్నారు. అమృత్ భారత్ పథకం ద్వారా 26.9 కోట్ల రూపాయలతో మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు సోమవారం రైల్వే అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ అన్ని హంగులతో రైల్వేస్టేషన్ కొత్త రూపు సంతరించుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అమృత్ భారత్ పథకం ప్రజల పాలిట వరమన్నారు. మరికొన్ని రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ రైల్వే మేనేజర్‌భరత్ కుమార్ జైన్, మంచిర్యాల రైల్వే మేనేజర్ ముత్తినేని రవీందర్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

వందే భారత్ రైలును ఆపాలని వినతి

మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలును నిలపాలని కోరుతూ సోమవారం మంచిర్యాల రైల్వే స్టేషన్‌కు వచ్చిన దక్షిణమధ్య రైల్వే జీఎం సందీప్ మాథుర్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ వినతి పత్రం అందించారు. మం చిర్యాలలో పలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు వందేభారత్ రైలును నిలుపుదల చేయాలని కోరారు. మంచిర్యాల నుంచి తిరుపతికి వెళ్లేందుకు ప్రతి రోజు రైళ్లను నడపాలని కోరారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

మూడో రైల్వే లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

బెల్లంపల్లి: 3వలైన్ ట్రాక్ నిర్మాణ పనులను త్వరిగతిన పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం సందీప్ మథుర్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి రైల్వే స్టేషన్ పరిశీలించారు. రైల్వే స్టేషన్‌తో పాటు ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ 3 వ రైల్వేలైన్ ట్రాక్ నిర్మాణ పనుల విషయంలో అధికారులందరూ సమిష్టిగా పనులు చేపట్టి త్వరితగిన నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. బెల్లంపల్లికి వచ్చిన రైల్వే జీఎంకు సీపీఐ నాయకులు వినతిప త్రం అందజేశారు. బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో నవజీ వన్, గ్రాండ్ ట్రాక్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపే విధంగా చూడాలని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. బెల్లంపల్లిలో నిరాంనగర్ అండర్ బ్రిడ్జిని ప్రారంభించి ప్రజలకు, వాహనదారులకు రాకపోకల అనుమతివ్వాలని కోరారు. సీపీఐ సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, పట్టణ కార్యదర్శి రాజమౌళి, నాయకులు తిలక్, రత్నం రాజ్యం, పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

భీమిని, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటోవాలాలు పరి మితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోవాలాలు ప్రతీ ఒక్కరూ యూనిఫాం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటంతో పాటూ వాహన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. లక్ష్మణ చారీ, ప్రవీణ్, వాహనదారులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో అక్రమ నిర్మాణాలను తొలగించాలి

కాసిపేట,జూలై7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో చట్టవిరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణాలను తొలగించాలని కోరుతూ తుడుం దెబ్బ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ భోజన్నకు దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు అడె జంగు మాట్లాడుతూ ముత్యంపల్లి శివారులోని 102 సర్వే నెంబర్‌లో అక్రమంగా ఇళ్లతో పాటు గుడులను నిర్మిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను కాపాడి భవిష్యత్ తరాలకు అందించాలి. కాని ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమిస్తూ చట్టవిరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వీటిని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు పెంద్రం హన్మంతు, మడావి అనంతరావు, కనకరాజు, సంద్ర భూమయ్య, ఆత్రం జంగు, కుర్సింగ తిరుపతి, కనక గోవర్ధన్, పల్లె చంద్రయ్య, పెంద్రం ప్రభాకర్ పాల్గొన్నారు.

నిరుపేదలకు నీడ కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్లు

కాసిపేట, జూలై7 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ నీడ కల్పించేందుకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ఆత్మచైర్మన్ రౌతు సత్తయ్య అన్నారు. సోమవారం కాసిపేట లంబాడితండ డి, ధర్మరావుపేటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ముగ్గు పోసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అర్హులైన పేదలు, నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి నీడ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీమండల అధ్యక్షులు రత్నం ప్రదీప్, నాయకులు భుక్య రవి, ఏనుగు జనార్ధన్ రెడ్డి, తిరుపతి, రాజమౌళి పాల్గొన్నారు.

పోడు రైతుల సమస్యలను పరిష్కరించండి



ఐటీడీఏ ఏవోకు వినతి పత్రం ఇస్తున్న తుడుందెబ్బ నాయకులు

కోటపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పోడు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఐటీడీఏ ఏవో దామోదర స్వామికి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో ఆదివాసీ రైతులు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని వారికి ప్రభుత్వం ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చిందన్నారు. పట్టాలు ఉన్నా అటవీ అధికారులు సాగు చేసుకోనివ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండి రమేష్, చెన్నూరు మండల అధ్యక్షుడు జయలు,రాష్ట్ర నాయకులు సెడెంక మాంతయ్య, వీగాం లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

భీమారం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం భీమారం మండల కేంద్రంలో సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మండల విద్యాధికారికి మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పని గంటలను పది గంటలకు పెంచిందని ఇది సరైంది కాదన్నారు. వెంటనే దీన్ని రద్దు చేయాలన్నారు. సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, కృష్ణమూర్తిగౌడ్, సరిత, విజయలక్ష్మీ, అనసూర్య, లక్ష్మీ, గురువమ్మ, విజయ, తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో ముఖ్యం

జైపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో దోహదపడతాయని ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఇందారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, హౌజింగ్ ఏఈ కాంక్ష, పంచాయతీ కార్యదర్శి సుమన్, పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు ఆదర్శనీయం



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న సీఐ, ఎంఈవో

మందమర్రిటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విద్యాభివృద్ధికి దివంగత అసోసియేట్ ప్రొఫెసర్ లింగయ్య స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు ఆదర్శనీయమని సీఐ శశిధర్‌రెడ్డి, ఎంఈవో దత్తు మూర్తి పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఒర్రెగడ్డ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో నోటు బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యా సామగ్రి ఉచితంగా అందించడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, భోజనం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, హెచ్ఎం పద్మజ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు చందర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రమేష్, బీమ్‌పుత్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

మందమర్రిరూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీలో నిర్మించిన ఫారంపండ్‌లు, నీటి కొలనులు తదితర పనులను కేంద్రం బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. సభ్యులు మాట్లాడుతూ పనులను పారదర్శకంగా నిర్వహించాలని, ఉపాధి కూలీలకు సక్రమంగా వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. ఎంపీడీవో రాజేశ్వర్, గ్రౌండ్ వాటర్ సైంటిస్టు రాంబాబు, ఏపీవో రజియాసుల్తానా, మధు, టీఏ రాజమల్లు, తిరుమల్‌గౌడ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సేవాసమితి సభ్యులకు సన్మానం

లక్షెట్టిపేట, జులై 7(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని ఇటిక్యాల శ్రీలక్ష్మి నరసింహస్వామి సేవా సమితి 5వ వార్షికోత్సవం స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కమిటి సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలను హర్షిస్తూ గ్రామస్తులు ప్రముఖులు సమితి వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులైన గొల్లపల్లి శ్రీధరాచార్య, గొల్లపల్లి రామానందస్వామిలను సత్కరించి అభినందించారు.

బీఎల్‌వోలకు శిక్షణ

భీమారం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : భీమారంలోని మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌వోలకు తహసీల్దార్ సదానందం, డిప్యూటి తహసీల్దార్ అంజమ్మ, మాస్టర్‌ట్రైనర్ షరీఫ్‌లు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు జాబితాలో తప్పొప్పులను సరి చేసేందుకు శిక్షణ ఇచ్చామన్నారు. బీఎల్‌వోలు విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు.

పోడు కోసం ఆగని గిరిజనుల పోరాటం

దండేపల్లి జూలై 7(ఆంధ్రజ్యోతి): పోడు భూముల కోసం గిరిజనుల పోరాటం ఆగడం లేదు. మండలంలోని లింగాపూర్ అటవీ ప్రాంత సమీపంలో బీట్ 380 కంపార్ట్‌మెంట్‌లో లింగాపూర్ చెందిన గిరిజనులతో పాటు గ్రామస్థులు కొందరు కొన్ని రోజుల నుంచి అటవీ బీట్‌లో చదును చేస్తున్నారు. సోమవారం మహిళలు కొందరు తొలగించిన పొదల వద్ద విత్తనాలు విత్తారు. విషయం తెలుసుకున్న తాళ్లపేట అటవీ రెంజ్ పరిధిలో సిబ్బంది, అక్కడివెళ్లి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఐబీ చౌరస్తాలో జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్ వర్మ, దశరథం, మల్లేష్, పోశం పాల్గొన్నారు.

దండేపల్లి : మండల ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, మండల అధ్యక్షుడు మంతెన నవీన్‌కుమార్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బాపన్న పాల్గొన్నారు.

జైపూర్ : అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు మూల రాజిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. రాష్ట్ర నాయకులు డాక్టర్ శరత్‌బాబు, జిల్లా నాయకులు మల్లేష్, పాల్గొన్నారు.

భీమారం : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. నాయకులు సత్యనారాయణ, ఏల్పుల సతీష్, మల్లేష్, కాంగ్రెస్ నాయకుడు రవి, బీఆర్ఎస్ నాయకుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మంచిర్యాలలో ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

లక్షెట్టిపేట: స్థానిక ఊత్కూర్ చౌరస్తాలో నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసారు. పట్టణ అధ్యక్షుడు విక్రమ్, నాయకులు పాల్గొన్నారు.

కన్నెపల్లి : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శేఖర్, రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

తాండూర్ : మండల ఇన్‌చార్జీ అయిల్ల గణేష్ రేచిని గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. బోయపల్లిలో రాజ్‌కుమార్, రాజీవ్‌నగర్‌లో కృష్ణ, మాదారంలో ఆనంద్, కాసిపేటలో కృష్ణ, కుష్నపల్లిలో లక్ష్మణ్, సంతోష్‌కుమార్‌లు జెండాలను ఆవిష్కరించారు.

మందమర్రిటౌన్ : పట్టణంలోని సింగరేణి పాఠశాల వద్ద, కోల్‌బెల్ట్ రోడ్డు వద్ద జెండాను ఎగుర వేశారు. అలాగే మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. నాయకులు సారంగం, రాజు, రాజనర్సు, శంకర్, సంతోష్, నరేష్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : రామకృష్ణపూర్‌లో సోమవారం మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. రాచర్ల సరేష్, రాజేందర్, సతీష్, పోచం పాల్గొన్నారు.

కాసిపేట: దేవాపూర్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రామిల్ల కళ్యాన్, మల్లేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

భీమిని : మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామంలో జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. మహేందర్, సన్యాసి, భీమయ్య, కిష్టయ్య, శంకర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్త వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలువార్డుల్లో జెండా ఆవిష్కరించామన్నారు. మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామగిరి మహేశ్, నాతరి స్వామి, శ్రీనివాస్‌తో పాటు నియోజకవర్గంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆహ్లాదం అధ్వానం...

(5వ పేజీ తరువాయి)

అక్కడ శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు మలమూత్ర విసర్జన కోసం స్థానికంగా ఉన్న రైల్వే పట్టాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో రైల్వే ట్రాక్‌కు సమీపంలో నివసిస్తున్న జనాలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయమై సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మినీ పార్కు స్థలంలో ఏకంగా ఐదారు కుటుం బాలు శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం.

కూరగాయల విక్రేతలతో రాకపోకలకు ఇబ్బంది...

ఇదిలా ఉండగా ఓవర్ బ్రిడ్జి నుంచి మొదలు కొని కాలేజీ రోడ్డులో కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. వ్యాపారస్తులు రోడ్ల వెంట దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్రయాలు చేపడుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. కాలేజీ రోడ్డలో పదుల సంఖ్యలో పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. వీటి కారణంగా ఈ ప్రాంతంలోని నిత్యం రద్దీగా ఉంటోంది. గోదావరి పుణ్య స్నానాలు ఆచరించేవారు సైతం ఇదే దారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. వీటికి అదనంగా ఇటీవల ప్రారంభించిన మహా ప్రస్థానం వద్దకు వెళ్లేందుకు కూడ ఇదే రోడ్డును ఉపయోగించాలి. తద్వారా కాలేజీ రో డ్డు నిత్యం బిజీగా ఉంటుండగా వాహనాల రాకపోకల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు మినీ పార్కు స్థలాన్ని అక్రమంగా ఆక్రమించిన వ్యాపారస్తులను అక్కడి నుంచి ఖాళీ చేయించి ఆ ప్రదేశంలో కూరగాయల విక్రేతల స్టాల్స్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఉండవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి ఈ దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని నగర వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఇదిలా ఉండగా గతంలో ఈ ప్రాంతంలో స్థితరపడ్డ చిరువ్యాపారులను ఖాళీ చేయించిన అధికారులు వారికి నగరంలోని క్వారీ రోడ్డులో శాశ్వత స్థలాలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులను కూడ క్వారీ రోడ్డుకే తరలించాలనే విజ్ఞప్తులు ఉన్నాయి.

గోరింటాకు సంబరాలు



తాండూర్‌లో గోరింటాకు సంబరాల్లో వాసవీ క్లబ్ మహిళలు

తాండూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో గోరింటాకు సంబరాలు ఆడపడుచులకు మన సారె కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వాసవీయన్ గోల్డెన్ స్టార్ సంతోష్‌కుమార్, డిస్ట్రిక్ట్ కార్పోరేట్ వైస్ చైర్మన్ మధుసూదన్ పాల్గొన్నారు.

హాజీపూర్: గుడిపేటలోని మహిళ సమాఖ్య కార్యాలయంలో వెలుగురేఖ వీవో సంఘం మహిళలు గోరింటాకు వేడుకలను నిర్వహించారు.

యాపిల్ తోటను సందర్శించిన న్యాయాధికారి

కెరమెరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనోర గ్రామంలోని యాపిల్ తోటను ఆసిఫాబాద్ సివిల్ జడ్జి యువరాజ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన యాపిల్ తోటలోని మొక్కలను పరిశీలించారు. యాపిల్‌తో పాటు వాటర్ యాపిల్, మామిడి, బత్తాయి, సపోటాతో పాటు ఇతర మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా యాపిల్ యజమాని బాలాజీ న్యాయమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి
సంబరాలను విజయవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల నిర్వహణపై అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, వివిధ మండలాల సమాఖ్య సభ్యులు, సెర్ప్ ఏపీఎంలు, డీపీఎంలతో సమీక్షా సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ వరకు ఇందిరా మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, మహిళా సంఘాల సభ్యుల సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. 8వ తేదీన ప్రతి మండలంలో మండల సమాఖ్య సభ్యులతో, 9న గ్రామ సమాఖ్య సభ్యులతో సమీక్షలు నిర్వహించాలని తెలిపారు.

ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సంఘంలో ఉన్న సభ్యురాలు ప్రమాదవశాత్తు చనిపోతే ప్రమాద బీమా, రుణ బీమా వర్తింపజేస్తోందన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు, పెట్రోల్ వంపులు నిర్వాహణ, చేపల పెంపకం, పెరిటి కోళ్ల పెంపకం, పాల డైరీ ఏర్పాటుకు ప్రోత్సహిస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఐదు కోట్ల రూపాయలతో మహిళా శక్తి భవనాల నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో 22 కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయడం ద్వారా రూ.20 లక్షల కమీషన్ వచ్చిందని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా 446 అమ్మ ఆదర్శ పాఠశాలలో రూ.7.82 కోట్ల పనులను చేయడం ద్వారా మహిళా సంఘాల బలోపేతానికి చేయూత అందించామని వివరించారు. జిల్లా సంఘాల్లో నమోదు కాని మహిళలను గుర్తించి చేర్పించాలని, జిల్లాలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల, కార్యదర్శి నవిత, కోశాధికారి కుసుమ, గౌరవ అధ్యక్షురాలు శ్రీదేవి, మండల సమాఖ్య సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలి

జిల్లాలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, మిషన్ భగీరథ ఈఈలతో పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మురుగు కాలువలను ప్రతీరోజు శుభ్రం చేయాలని, అంతర్గత రహదారులపై ఉన్న గుంతలను పూడ్చి నీటినిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి వనరులలో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్, బయోటెక్స్ స్ప్రే పిచుకారి చేయాలని తెలిపారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటిని సందర్శించి నిల్వ ఉన్న నీటిని పడవేయాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సీతారాం, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, ఈఈ సిద్దిఖి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

- ఉమ్మడి జిల్లాకు రూ.11.73 కోట్లు నిధులు విడుదల
- పాఠశాలల్లో తీరనున్న సమస్యలు



గిరిజన ఆశ్రమ పాఠశాలలకు మహర్దశ

వాంకిడి, జూలై 7(ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల దశ మారనుంది. కొన్నేళ్ల నుంచి ఆశ్రమ పాఠశాలలకు నిధులు విడుదలకాక విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. కనీస సౌకర్యాల కొరత, సంత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. గిరిజన ఆశ్రమపాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో గిరిజన ఆశ్రమ పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఊట్నూర్ పరిధిలోని కుమరంభీం, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని 149 ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 34,910 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. వారికి అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, బాత్‌రూం సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక అవస్థలకు గురవుతున్నారు. దీంతో ఆశ్రమపాఠశాలల్లో వసతుల కల్పనకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖకు రూ. 11.73 కోట్లు నిధులు మంజూరు చేసింది.

● ప్రతీ సంవత్సరం ప్రతిపాదనలతోనే సరి..

విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే ఆశ్రమ పాఠశాలలు సమస్యలతో స్వాగతం పలుకుతుంటాయి. ప్రతీ సంవత్సరం ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు వినతులు ఇవ్వడం మామూలైంది. ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ఐటీడీఏ ఆధీనంలోని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారులు ఏళ్లుగా రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖకు నివేదికలు పంపిస్తున్నారు. ప్రతీసారి విద్యాసంవత్సరం ప్రారంభంలో ఆశ్రమపాఠశాల సమస్యలపై అధికారుల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తున్న ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో కనీస సౌకర్యాల కల్పనకోసం నిధులను విడుదల చేసింది.

జిల్లా	ఆశ్రమ పాఠశాలలు	విద్యార్థులు	మంజూరైన నిధులు(రూ.కోట్లలో)
కుమరం భీం	50	10,921	3.64
ఆదిలాబాద్	64	17,337	4.34
మంచిర్యాల	18	3,086	2.36
నిర్మల్	17	3,566	1.39

● తీరనున్న సమస్యలు

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలకు నిధు లు విడుదల చేయడంతో పాఠశాలల్లో సమస్యలు తీరనున్నాయి. మంజూరైన నిధులతో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించనున్నారు. తొలుత అవసరమైన పాఠశాలల్లో మరమ్మతులు, తాగు నీటి సమస్యలు పరిష్కరిస్తారు. తరగతి గదుల్లో లైటింగ్, వైరింగ్ బాగుచేస్తారు. పాఠశాల భవనాలు అందంగా ఆకర్షణీ యంగా కన్పిం చేలా రంగులు వేయించనున్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

సకాలంలో పనులు పూర్తి అయ్యేలా చర్యలు

నజీమొద్దీన్, ఏఈ ఐటీడీఏ

ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు మంజూరైన నిధులతో పనులు ప్రారంభించాము. ప్రస్తుతం వాంకిడి, బంబార ఆశ్రమపాఠశాలల్లో పనులు కొనసాతున్నాయి. మిగితా పాఠశాలల్లోను సత్వరమే పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాము.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ

కెరమెరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం, భీమన్‌గొంది గ్రామాల్లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కుసుమ్ రావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం కేటాయిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చరణ్, బుచ్చన్న, దిలీప్, కార్యదర్శులు బొజ్జిరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ ప్రోగ్రాం ప్రారంభం

కౌటాల, జూలై 7(ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం బండల్‌హెట్టి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈవో హనుమంతు ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్ ప్రోగ్రాంను సోమవారం ప్రారంభించారు. పాఠశాలలో 3, 4, 5 తరగతుల్లో వెనకబడిన విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితంలో కంప్యూటర్ ద్వారా ప్రత్యేకంగా బోధించారు. కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ సునీత, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రచారి, ఉపాధ్యాయులు రమేష్, శారద, విఠల్, సీఆర్పీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

దహెగాం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకన్నారు. పీరీలను గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించారు.

యూరియా కోసం బారులు

వాంకిడి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా కోసం రైతులు సోమవారం బారులు తీరారు. యూరియా కోసం వారం రోజుల నుంచి తమ పేర్లను నమోదు చేసుకున్న రైతులు సోమవారం ఉదయం ఒక్కసారిగా రావడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అధికారులు కొంత సేపు యూరియా పంపిణీ నిలిపివేశారు. క్యూ కడితేనే పంపిణీ చేస్తామని సిబ్బంది పేర్కొనడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల నుంచి తమ పేర్లను నమోదు చేసినప్పటికీ యూరియా ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని రైతులు వాపోయారు. అనంతరం పోలీసు బందోబస్తుతో రైతులకు యూరియా పంపిణీ చేశారు.


వాంకిడిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

జీవో నంబర్ 282 ప్రతుల దహనం

ఆసిఫాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పని గంటలను పెంచుతూ జారీ చేసిన జీవో నంబర్ 282 ప్రతుల ను ఆసిఫాబాద్ పట్టణంలో ఏఐటీయూసీ, సీఐటీ యూ, ఐఎన్‌టీయూసీ నాయకులు సోమవారం దహనం చేశారు. ఈ జీవోతో కార్మికులకు పనిభారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఉపేందర్, శ్రీకాంత్, లోకేష్, సుధాకర్, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాయకులు రాజేందర్, ఆనంద్, రమేష్, రఘునాథ్, మల్లేష్, గౌతం రాజు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: జీవో నంబర్ 282 ప్రతులను సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ చౌరస్తాలో దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు త్రివేణి, నాయకులు చంద్రయ్య, మల్లేష్, రమేష్, అశోక్, లక్ష్మణ్, శ్రీనివాస్, సత్యం, అరుణ, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, ప్రధాన కార్యదర్శి అడివయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌లో జీవో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

యూరియా కొరత లేకుండా చూడాలి

జైనూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరతలేకుండా చూడాలని మండల రైతులు కోరారు. మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతు జైనూర్‌లో నాలుగు ప్రభుత్వ షాపులతో పాటు ప్రైవేట్ దుకాణాల్లో యురియా వస్తున్నప్పటికీ కేవలం గంటలోనే యురియా గోదాం ఖాళీ అవుతుందని వాపోతున్నారు. యూరియా కోసం ప్రభుత్వ దుకాణాలవద్ద పడిగాపులు కాస్తున్నామన్నారు. వర్షాలు కురుస్తున్నందున యూరియాను సకాలంలో అందించాలని కోరుతున్నారు. సమవేశంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మొక్క నాటి నీటిని పోస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని పర్యావరణ పరిరక్షణ కొరకు మొక్కలు నాటాలని తెలిపారు. జిల్లాలో 51 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, ఆయా శాఖల అధికారులు తమకు కేటాయించి లక్ష్యాన్ని సాధించేందుకు రోజు వారీగా కింది స్థాయి సిబ్బంది నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని తెలిపారు. గ్రామాలలో రహదారులకు ఇరువైపులా ప్రభుత్వ భూములలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల ఆవరణ, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లోని సెక్రెటరీయేట్‌లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆయన చాంబర్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధితో పాటు కొత్తగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి ఎక్కువ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉపముఖ్యమంత్రి స్పందించి ఆసిఫాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణరావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. .

మాదకద్రవ్య రహిత సమాజం కోసం పాటుపడాలి

కాగజ్‌నగర్ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. సోమవారం కాగజ్‌నగర్ మండలంలోని బురదగూడ గ్రామంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ, వాటి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వలన కలిగే చెడు పరిణామాలను గుర్తించాలని, గంజాయి, డ్రగ్స్ బారిన పడి యువత జీవితాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డిఎస్పీ రామానుజం, రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

విలేజ్ ఆఫీసర్ కార్యక్రమం ప్రారంభం..

బురదగూడ గ్రామంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్ గ్రామ పోలీస్ అధికారి వ్యవస్థను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీగ్రామానికి ఒక పోలీసును నియమించామన్నారు. గ్రామ పోలీసు అధికారి గ్రామస్థులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాడన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

మాదకద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయి

పెంచికలపేట: మాదకద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని యువత వాటికి దూరంగా ఉండాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, ఏఎస్సై ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎంఈవో ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

ఆసిఫాబాద్ (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులను ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు.

రేపటి నుంచి వాలీబాల్ టోర్నమెంట్

బెజ్జూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో ఈ నెల 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై సర్తాజ్ పాషా తెలిపారు. బెజ్జూరు పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి గల యువకులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

చింతలమానేపలి: చింతలమానేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

10న అతిథి అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూ

ఆసిఫాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహాత్మాజ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు అతిథి ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి ఈ నెల 10న డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌వో శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట బాలుర పాఠశాలలో ఉదయం 9 గంటలకు బయోడేటా, విద్యార్హత జిరాక్స్ పత్రాలు, ఒర్జినల్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

కార్మిక చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

కాగజ్‌నగర్ టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాల అమలులో విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం స్థానిక సిర్పూర్ పేపర్ మిల్లు గేటు ఎదుట సార్వత్రిక సమ్మె కరపత్రాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. జూలై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లా వ్యాప్తంగా కార్మికులందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సీఐటీయు నాయకులు క్రిష్ణమాచిరా తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్ టౌన్, జూలై 7: దేశ వ్యాప్త కార్మిక సంఘాల సమ్మెలో ఆదివాసీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలతి అన్నారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మిక హక్కులను కాలరాస్తూ ఇప్పటికే గుజరాత్ రాష్ట్రంలో 12 గంటల పని దినం అమలు చేస్తున్నారన్నారు. టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

● జూలై 9 నిర్వహించే సార్వత్రిక సమ్మెలో వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ ఒక ప్రకటనలో కోరారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

తిర్యాణి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ అవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్, వెంకటేశంగౌడ్, హరీష్‌కుమార్, సంతోష్, ఎల్లయ్య, బాబు, వెంకటేశం, శ్యాం, లక్ష్మణ్, బాబు, నర్సయ్య, అంజయ్య, రవీందర్, రాజలింగు, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, మహేష్, రాంచందర్, శంకర్, అశోక్, రఘునాథ్, రాజయ్య, వినేష్, శ్రీకాంత్, కళ్యాణ్, రాజన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని బాబాసాగర్, చింతలమానేపల్లి, కర్జెల్లి తదితర గ్రామాల్లో జరిగిన వేడుకల్లో నాయకులు రామయ్య, శంకర్, శీను, విలాస్, సాలయ్య, నారాయణ, వెంకటి, సత్యం, మహేష్, శంకర్, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, నాయకులు మౌనిష్, బాపు, తిరుపతి, రాజేందర్‌గౌడ్, సత్యనారాయణ, విఠల్, శంకర్, మల్లేష్ పాల్గొన్నారు.


చింతలమానేపల్లిలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఒప్పంద పద్ధతిన పనిచేసేందుకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీ విద్యాలయాల్లో యూఆర్ఎస్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను ఒప్పంద పద్ధతిన భర్తీ చేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఈవో యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్ఎం-2, అకౌంటెంట్-3, యూఆర్ఎస్‌లో అసిస్టెంట్ కుక్-1, నైట్ వాచ్‌మెన్-1, డే వాచ్‌మెన్-1 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని డీఈవో సూచించారు.